పల్లె రోడ్లు ఛిద్రం

- చిన్నపాటి వర్షానికే ఆగమాగం
- గుంతలు, కంకరతేలి అధ్వానం
- నరకప్రాయంగా మారిన ప్రయాణం

ఇటిక్యాల: అసలే అధ్వాన రోడ్లు.. ఆపై వర్షాకాలం, ఇంకేముంది చిన్నచిన్న వానలకే పల్లెల రోడ్లు పూర్తిగా ఛిద్రమయ్యాయి. మట్టి రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి బురదమయంగా మారాయి. దీంతో వాహన దారులు రోడ్లపై ప్రయాణించాలంటే నానా అవస్థలు పడుతున్నా రు. ఇక పాదచారుల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఆయా గ్రామాలకు అంబులెన్స్, ఆర్టీసీ బస్సులు సైతం రాని దుస్థితి నెలకొంది. ఇట్టి రోడ్లపై ప్రయాస లేకుండా ప్రయాణం చేయలేని పరస్థితి నెలకొంది. అక్కడక్కడున్న బీటీరోడ్లపై మరమ్మతు సైతం చేయకపోవడంతో అవి కూడ పూర్తిగా ధ్వంసమైపోయాయి.

- మండలం పరిధిలోని చాగాపురం, షాబాద్, సాతర్ల, వావిలాల, బుడ్డారెడ్డిపల్లి, గ్రామాలకు వెళ్లే రోడ్లపై మోకాలి లోతు గుంతలు ఏర్పడ్డాయి.
- మండల కేంద్రం నుంచి శివనంపల్లి, పెద్దదిన్నె గ్రామాలకు వెళ్లే రోడ్డుపై వర్షం నీరు నిలిచి బురద, గుంతల మయంగా మారింది. ఇలా మండల పరిధి లోని పలు గ్రామాల రోడ్డు అ ధ్వానస్థితికి చేరుకున్నాయి. రోడ్ల మరమ్మతు విషయమై పలుమార్లు సంబంధిత శాఖల అధికారులకు విన్నవించుకున్న ఏమాత్రం పట్టించు కో వడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.


చిన్నపాటి వర్షానికే బురదమయంగా శివనంపల్లి రోడ్డు


కంకర తేలిన సాతర్ల- వావిలాల రోడ్డు


గుంతలమయంగా చాగాపురం రోడ్డు

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

అలంపూర్: మండలంలోని లింగనవాయి, ఇటిక్యాల మండలంలోని ఉందండాపురం గ్రామస్తులు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడును వారి నివాసంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్సీని, ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.


ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో ఉదండాపురం గ్రామస్తులు

క్లుప్తంగా

వాల్మీకి జయంతి విజయవంతం చేద్దాం

కేటీదొడ్డి: వాల్మీకి జయంతిని పురస్కరించుకొని మండలంలోని ప్రతి గ్రామంలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించాలని వాల్మీకి మండల అధ్యక్షుడు టీచర్ గోవిందు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వేడుకల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. గతంలో కులగణనలో నిర్వహించిన విధులకు గాను ఎలాంటి నిధులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేదని సోమవారం పాఠశాల ఎదుట ఎంపీడీఓ తిరుపతన్నకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కులగణనకు 12 జిల్లాలకు నిధులు మంజూరు చేసిన గద్వాల జిల్లాలోని ఉపాధ్యాయులకు మాత్రం నిధులు మంజూరు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైన్ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయురాలు హేమలత, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల అవగాహన ర్యాలీ



గద్వాల: విద్య ప్రాధాన్యతను గుర్తించి మహిళలు తప్పకుండా చదువుకోవాలని, మత్తు పదార్థాలు, బాల్య వివాహ నిర్మూలనపై అవగాహన ఉండాలని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సూచించారు. సోమవారం గద్వాల ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మండలంలోని గుంటిపల్లి, కొత్తపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే సేవా భావంతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పవన్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి వీరేషం, విద్యార్థులు పాల్గొన్నారు.

బీచుపల్లిలో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని పవిత్ర కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకొన్నారు.

కుళాయి నీళ్ల విషయంలో దాడి

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు గ్రామానికి చెందిన మంగలి వెంకటేశ్వర్లు, ఇంటి పక్కన ఉన్న పింజరి హుస్సేన్ కుళాయి నీళ్లు పారుతున్న విషయంలో కొన్ని రోజులుగా ఘర్షణ పడుతున్నారు. ఈ క్రమంలో పింజరి హుస్సేన్ మంగలి వెంకటేశ్వర్లు తలపై ఇటుకతో దాడి చేశాడు. దాడిలో తలకు రక్తగాయం కావడంతో వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

పాఠశాలకు తాళం



ఉండవెల్లి: మండలంలోని బైరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పెట్టి పాఠశాలకు తాళం వేశారు. ఉపాధ్యాయులు ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి వెళ్లగా, ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ రామకృష్ణ సెలవులో ఉన్నారు. దీంతో పాఠశాలలో ఉపాధ్యాయులు ఎవరూ లేకపోవడంతో పాఠశాలకు తాళం వేసి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దసరా సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులను ఇళ్లకు పంపించడం ఏంటని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

రౌడీషీటర్ బైండోవర్

ఉండవెల్లి: ఎన్నికల ప్రక్రియలో భాగంగా రౌడీషీటర్ బోయ రూబిని శాంతి భద్రతల విఘాతం కలుగకుండా సోమవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.తహసీల్దార్ ప్రభాకర్ ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

పకడ్బందీగా విధులు నిర్వహించాలి


అలంపూర్‌లో శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

అలంపూర్/మానవపాడు/అయిజ/గట్టు/మల్దకల్/ఇటిక్యాల/రాజోళి/ఎర్రవల్లి: స్థానిక సంస్థ ఎన్నికల్లో అప్పగించిన బాధ్యతలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ పద్మావతి అన్నారు. పట్టణంలోని ఉపాధి హామీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల పీఓ, ఏపీఓల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న పీఓలు, ఏపీఓలకు సలహాలు సూచనలు ఇచ్చారు. ఆర్ఓలు ఎన్నికల్లో నిర్వర్తించాల్సిన బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆర్ఓలు అశోక్‌కుమార్, అమరేందర్‌రెడ్డి, బాలాజీ, కృష్ణకుమార్, జెడ్పీటీసీ ఆర్ఓలు విజయ్‌కుమార్‌రెడ్డి, రిసోర్స్‌పర్సన్ దేవేందర్‌రెడ్డి, పీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

- మానవపాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ రాఘవ, ఎంఈఓ శివప్రసాద్, మాస్టర్ ట్రైనర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ఎన్నికలపై ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 27 మంది ప్రిసైడింగ్ అధికారులు, ముగ్గురు సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.
- ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నకల విధులు పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల జిల్లా సహాయ అధికారి భాస్కర్, ట్రైనర్ తిమ్మారెడ్డి సూచించారు. అయిజ మండలంలోని ఉత్తనూరు రైతువేదిక భవనంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పీఓలు, ఏపీఓలు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చెన్నయ్య కోరారు. గట్టు మండల పరిషత్ కార్యాలయంలో పీఓలు, ఏపీఓలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. బ్యాలెట్ బాక్స్, బ్యాలెట్ పేపర్లు, ఓటర్ జాబితా, పోలింగ్ రోజున తీసుకోవాల్సిన చర్యల గురించి తెలియజేశారు.
- అధికారులు సమన్వయంతో పని చేయాలని ట్రెనింగ్ అధికారి వెంకటేష్ సూచించారు. మల్దకల్ రైతువేదికలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంఈఓ సురేష్ ఆధ్వర్యంలో 26 మంది పీఓ, 67 మంది ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధివిధానాలపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్, సూపరింటెండెంట్ నర్సన్న, సీనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఇటిక్యాల మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునంద, ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రెనింగ్ అధికారి విష్ణు బ్యాలెట్ బాక్స్ ఓపెనింగ్, సీల్ చేయడం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.
- రాజోళిలోని రైతు వేదికలో పీఓ, ఏపీఓలకు ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజా మెయినుద్దీన్, ఎస్ఐ గోకారి, తహసీల్దార్ రామ్మోహన్, ప్రత్యేధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
- ఎర్రవల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిటర్నింగ్ అధికారి సుషిత ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఓటర్ ఓటు వేసే విధానం గురించి వారికి సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహ్మద్ అబ్దుల్‌సయ్యద్‌ఖాన్, ఎంఈఓ అమీర్‌పాషా, పీఓలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.


మల్దకల్‌లో ఎన్నికల విధులపై శిక్షణ ఇస్తున్న ట్రైనర్ వెంకటేష్

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

గద్వాల: స్థానిక సంస్థ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పార్టీ నియోకవర్గ ఇన్‌చార్జ్‌బాసు హనుమంతునాయుడు అన్నారు. ధరూరు మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాఘువేంద్ర, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, వెంకటేష్, ఆంజనేయులు, మోనేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి

కేటీదొడ్డి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో గులాబీ జెండాను ఎగురవేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతునాయుడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల స్థాయి ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి స్థానిక ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలన్నారు. అనంతరం గువ్వలదిన్నె, పాగుంట, వెంకటాపురం, కొండాపురం, తూర్పుతాండలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు చక్రధర్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, రాఘువేంద్ర రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్, మోనేష్ పాల్గొన్నారు.


కేటీదొడ్డిలో వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

ఎన్యుమరేటర్లకు వేతనం విడుదల చేయాలి


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

అలంపూర్: ఎన్యుమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇవ్వాల్సిన వేతనం తక్షణమే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐకేపీ భవనంలో స్థానిక సంస్థల ఎన్నికల శిక్షణలో భాగంగా సోమవారం ఎంపీడీఓ పద్మావతికి టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇప్పటి వరకు రెమ్యునరేషన్ ఇవ్వలేదన్నారు. ఏడాది క్రితం సమగ్ర కుటుంబ సర్వేలో విధులు నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం రెమ్యునరేషన్ తక్షణమే విడదల చేయాలన్నారు. ఎన్నికల్లో జూనియర్లు పీఓలుగా సీనియర్లకు ఓపీఓలుగా విధులు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు రాముడు, బయన్న, రాజకుమార్, వెంకట్రాముడు, వెంకటస్వామి, మధునాయుడు, పీఆర్‌టీయూ నాయకులు వెంకటనాయుడు, వీరేశప్ప తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటుదాం

గద్వాల/గట్టు/శాంతినగర్/మల్దకల్/ఇటిక్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుదామని పార్టీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. సోమవారం గట్టులో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు గూడురు నాగప్ప అధ్యక్షతన బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ.. గద్వాల ప్రాంతం డీకే అరుణ హయాంలోనే అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. ఆనాడు డీకే అరుణ పాదయాత్రతో నెట్టెంపాడును సాధించారని, నేడు పచ్చని పంట పొలాలు కనువిందు చేస్తున్నట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా గ్రామాలు అభివృద్ధి చెందాలంటే బీజేపీ ఆదరించాలని కోరారు. స్థానిక ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఆదరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హనిమిరెడ్డి, సురేష్, కిట్టుస్వామి, సంజీవనాయుడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

- కేంద్రంలో సుస్థిర పాలన అందిస్తూ వివిధ సంక్షేమ పథకాలతో సామాన్యులకు మేలు చేస్తున్న బీజేపీని ప్రజలు ఆదరించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో స్థానిక ఎన్నికల్లో భాగంగా సన్నాహక సమావేశం నిర్వహించారు.

కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకులు రాజగోపాల్, మధుసూదన్‌గౌడ్, వెంకటేశ్వర్లు, రంజిత్ పటేల్, హరికృష్ణ, వెంకట్రాములు, పరశురాముడు, నరేష్, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పార్టీ జిల్లా కన్వీనర్ రామచంద్రారెడ్డి అన్నారు. మల్దకల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాముడు, నాగరాజు, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.


శాంతినగర్‌లో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

- స్థానిక ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ ధరూరు మండల ఇన్‌చార్జ్ బండల వెంకట్రాములు అన్నారు. జిల్లా కేంద్రంలోని డీకే బంగ్లాలో ధరూరు మండలం నాయకులతో సమీక్షించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో గద్వాల నియోజకవర్గంలో బీజేపీ 70 వేలకు పైగా ఓట్లు వచ్చాయని ఇదే స్ఫూర్తిని కొనసాగించి కేంద్ర ప్రభుత్వం పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సంజీవ్ భరద్వాజ్, రాంచంద్రారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.
- ఇటిక్యాల మండల పరిధిలోని ఉదండాపురంలో పార్టీ మండలాధ్యక్షుడు షేక్ అబ్దుల్లా ఆధ్వర్యంలో బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఒక్క పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖచ్చితంగా బీజేపీ కై వసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తిమ్మారెడ్డి, నాగముని, గజేంద్ర, మహేష్, మహేంద్ర, కిశోర్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.
- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయఢంకా మోగించాలని బీజేపీ జిల్లా నాయకుడు దేవదాస్ అన్నారు. ఎర్రవల్లి మండల కేంద్రంలో పార్టీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. బీజేపీ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నార్నారు. పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.


మల్దకల్‌లో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఎన్నికల కన్వీనర్ రామచంద్రారెడ్డి

10.35 లీటర్ల మద్యం స్వాధీనం

ఉండవెల్లి: మండలంలోని చిన్నఆముదాలపాడు గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు కిరాణ దుకాణంపై జరిపిన దాడిలో 10.35 లీటర్ల మద్యం పట్టుబడినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేసి రూ.9,040 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయాలని వినతి

రాజోళి: రాజోళి– శాంతిగనర్ ప్రధాన రోడ్డుకు మరమ్మతు చేయాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డుపై వెళ్తున్నాయన్నారు. వర్షాల నేపథ్యంలో రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. ఏళ్ల తరబడి ఎంతో మంది అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మరమ్మతు అయినా చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సుధాకర్, ప్రవీణ్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

చెట్ల కింద చదువులతో అవస్థలు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ఏళ్ల తరబడి వేధిస్తున్న సమస్యలు

మల్దకల్: విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక చెట్ల కింద విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి దాపురించింది. ఇంకెన్నాళ్లీ దేవుడా చెట్ల కింద చదువులు అంటూ చిన్నారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు జిల్లా పరిషత్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా గదులు లేక ప్రతి నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సగానికి పైగా పాఠశాలలకు గదుల కొరత ఉండటంతో చెట్ల కింద, వరండాలు, తాత్కాలిక రేకుల షెడ్లలో విద్యార్థులు కాలం వెల్లదీయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది.

బడి మానేసి పొలం బాట..

మండలంలో మొత్తం 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 4 ఉన్నత, 27 ప్రాథమిక పాఠశాలల్లో మొత్తం 5,948 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి సరిపడా గదులు, వసతులు లేక మధ్యలోనే బడిమానేసి పొలం బాట పడుతున్నారు. ప్రభుత్వం విద్యను ప్రోత్సహించేందుకు ఓ పక్క చర్యలు తీసుకుంటున్నా.. మరో పక్క పాఠశాలల్లో మౌలిక వసతులు లేక గ్రామీణ విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. మల్దకల్ హైస్కూల్‌లో 666 మంది విద్యార్థులకు గాను 12 తరగతి గదులున్నాయి. ఉన్న గదులు పైపెచ్చులూడి ప్రమాదభరితంగా మారాయి. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులను చెట్లకింద కూర్చొబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. అలాగే పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. ప్రహరీలు లేకపోవడంతో ఆవరణ అపరిశుభ్రంగా మారింది. బిజ్వారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 398 మంది విద్యార్థులకు గాను 10 తరగది గదులున్నాయి. ఇక్కడ కూడా చెట్ల కిందనే పాఠాలు బోధిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు సరిపడా మౌలిక వసతులు, తరగతి గదులను నిర్మించాలని కోరుతున్నారు.


మల్దకల్‌లో చెట్లకింద విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు


బిజ్వారంలో తరగతి గదులు లేక ఆరుబయట విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు

రోజు ఇబ్బంది పడుతున్నాం

సరిపడా గదులు, వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. మౌలిక వసతులు లేని కారణంగా విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. గదులు లేక రోజు చెట్ల కింద చదువుకోవాల్సిన పరిస్థితి ఉంది.

– నందకిశోర్, 6వ తరగతి, మల్దకల్

బడికి వెళ్లాలంటేనే భయం

బడికి వెళ్లాలంటే భయంగా ఉంది. పాఠశాలల్లో సరిపడా గదులు లేక చెట్ల కింద చదువుకుంటున్నాం. ఉన్న గదుల్లో పైకప్పు పెచ్చులూడి ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నాం.

– సోని 9వ తరగతి, బిజ్వారం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పాఠశాలల్లో నెలకొన్న గదులు కొరత, మౌలిక సదుపాయాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్న గదుల్లోనే సమస్య లేకుండా విద్యాభ్యాసం చేయిస్తున్నాం. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సురేష్, ఇన్‌చార్జ్ ఎంఈఓ, మల్దకల్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల కె.నీలాంజనుడు - 9642913894
అలంపూర్/అయిజ ఎన్.గోవర్ధన్ - 9948797122
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083
సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :
అశోక్ : 9398469650